




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# జనం ముచ్చట

సోమవారం, సెప్టెంబర్ 07, 2026 తెలంగాణ పేజీలు : 4



నేలకొండపల్లి మండలం,అప్పలనర్సింహపురంలో...





# అభివృద్ధి పేరుతో... అక్రమ మట్టి తవ్వకాలు

2 లో..

**నేలకొండపల్లి మండలం,అప్పలనర్సింహపురంలో అక్రమ మట్టి తవ్వకాలు..**

**రోడ్డు నిర్మాణం పేరుతో కోట్లాది రూపాయల మట్టి తవ్వేస్తున్నారంటూ స్థానికుల ఆరోపణలు...**

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 6 (జనం ముచ్చట):** నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహపురం గ్రామ పరిధిలో రోడ్డు నిర్మాణం పేరుతో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఓ కాంట్రాక్టర్ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రకృతి సంపదను విచక్షణారహితంగా దోచుకుంటూ, భారీ యంత్రాలతో పట్టపగలే మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా రోడ్డు నిర్మాణ పనులకు అవసరమైన మట్టిని సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొంది వినియోగించాల్సి ఉండగా, ఇక్కడ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు...

## బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే

# ఖబడ్దార్!

2 లో..

**పోలీసులకు పువ్వాడ అజయ్ కుమార్ హెచ్చరిక**

**జూలూరుపాడు, సెప్టెంబర్ 6 (జనం ముచ్చట):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలు, దొంగ గ్యారెంటీలను నమ్మి అధికారంలోకి తెచ్చినందుకు తెలంగాణ ప్రజలు నేడు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. పల్లెల్లో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా పడకేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని నాయకులు విమర్శించారు...

**వైరా నియోజకవర్గం,జూలూరుపాడులో బీఆర్ఎస్ భారీ నిరసన కార్యక్రమం...**

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో తెలంగాణ వినాశనం -- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ధ్వజం**

**కేసీఆర్ హయాంలో అభివృద్ధి -- కాంగ్రెస్ పాలనలో విధ్వంసం....**

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పండుగలా సాగిందని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. అయితే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వనాశనం వైపు పయనిస్తోందని ఆరోపించారు.కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ప్రతి పల్లె అభివృద్ధి చెందిందని, కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారని గుర్తు చేశారు.



# అభివృద్ధి పేరుతో...

# అక్రమ మట్టి తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

**కోట్లాది రూపాయల మట్టి అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు....**

ఈ ప్రాంతంలో జరుగుతున్న మట్టి తవ్వకాల పరిమాణాన్ని పరిశీలిస్తే పెద్ద ఎత్తున సహజ వనరులు తరలిపోతున్నట్లు కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనుల అవసరాలకు మించి మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారా? దీనికి సంబంధించి రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ, ఇతర రుసుములు చెల్లించకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లయితే ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు....

**అక్రమ తవ్వకాలను ప్రశ్నించిన వారిపై బెదిరింపులా?**

అక్రమ మట్టి తవ్వకాలపై ప్రశ్నిస్తున్న స్థానికులను సదరు కాంట్రాక్టర్, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ మంత్రి పేరును ప్రస్తావిస్తూ తమను ఎవరూ ఏమీ





చేయలేరన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారని కొందరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే, మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై కూడా అధికారులు విచారణ జరిపి వాస్తవాలను బయటకు తేవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధుల పేర్లను ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు....

**అధికారులు ఎందుకు స్పందించడం లేదు?**

గ్రామంలో పట్టపగలే భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు కాంట్రాక్టరు మంత్రి పేరు చెబుతుండటంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారా? లేక మట్టి తవ్వకాలకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయా? అనే సందేహాలకు అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు....

**తవ్వకాలపై సమగ్ర విచారణకు డిమాండ్...**

అప్పలనర్సింహపురంలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, పర్యావరణ నిబంధనలు, మైనింగ్ అనుమతులు,
రాయల్టీ చెల్లింపులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రకృతికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి సంబంధిత కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో సహజ సంపదను అక్రమంగా దోచుకునేందుకు ఎవరినీ అనుమతించబోమని స్థానికులు హెచ్చరిస్తున్నారు.
అప్పలనర్సింహపురం మట్టి తవ్వకాల వ్యవహారంపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను ఎప్పుడు బయటపెడతారు? అన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది....

---

(మొదటి పేజీ తరువాయి)

# బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే...

# ఖబడ్దార్!

ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో పంటలకు సరైన సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు....

**సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిర్లక్ష్యం...**

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పనులను దాదాపు 90 శాతం వరకు పూర్తి చేసిందని పువ్వాడ తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కాలువల లైనింగ్ పనులను కూడా సక్రమంగా చేపట్టకపోవడం వల్ల పలు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆయన ఆరోపించారు ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా ఉండాలని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు....

**పోలీసులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ హెచ్చరిక...**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడితే సహించేది లేదని మాజీ మంత్రి,బీఆర్ఎస్ నాయకుడు పువ్వాడ అజయ్



కుమార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీసులు వ్యవహరించి బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించడం, వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయడం వంటి

చర్యలకు పాల్పడితే భవిష్యత్తులో అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన అన్నారు..గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తూ ప్రజలకు

సేవలు అందించారని పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కొందరు పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసులు రాజకీయ పార్టీలకు అతీతంగా, చట్టానికి లోబడి విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అధికారంలో ఉన్న నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు....

**అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడవద్దు....**

రాష్ట్రంలో భవిష్యత్తులో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిపై భవిష్యత్తులో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికి వచ్చి అక్రమ కేసులతో వేధించాలని ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా, ప్రజలకు న్యాయం చేసే విధంగా తమ విధులను నిర్వర్తించాలని హితవు పలికారు..ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు....

## హామీలు అమలు చేయాలంటూ

# ఖమ్మంలో ఆటో కార్మికుల భారీ ర్యాలీ

సంక్షేమ

**పువ్వాడ అజయ్ కుమార్ పిలుపుతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన...**

**ఖమ్మం, సెప్టెంబర్ 6 (జనం ముచ్చట):**
ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నియోజకవర్గంలో ఆటో కార్మికులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపుతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆటో కార్మికులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తార్ మియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్టీయూ జిల్లా నాయకుడు పాషా, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.....







**ఆటో కార్మికుల బకాయిలు చెల్లించాలి....**
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.
ప్రతి ఆటో కార్మికుడికి రూ. 36 వేల బకాయి చెల్లించాలి
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని నాయకులు గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఈ హామీ అమలు కాలేదని ఆరోపించారు. ఈ లెక్కన ప్రతి ఆటో కార్మికుడికి మూడు సంవత్సరాలకు కలిపి రూ. 36 వేల బకాయి పడుతుందని పేర్కొంటూ, ఆ మొత్తాన్ని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు....

**ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులపై తీవ్ర ప్రభావం....**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా ఆటో కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఆదాయంపై ఆధారపడి జీవనం సాగించే వేలాది ఆటో కార్మిక కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు.
ఆటోలను కొనుగోలు చేసేందుకు తీసుకున్న ఫైనాన్స్ రుణాలకు నెలవారీ వాయిదాలు చెల్లించలేకపోతున్నారని, పిల్లల విద్యా ఫీజులు, ఇంటి ఖర్చులు కూడా భారంగా మారాయని పేర్కొన్నారు. ఒకవైపు ఆదాయం తగ్గిపోవడం, మరోవైపు పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో జీవిస్తున్నారని అన్నారు...

**బాధిత కుటుంబాలను ఆదుకోవాలి....**
ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారంతో పలువురు ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల కుటుంబాల్లో విషాదం నెలకొన్నప్పటికీ ప్రభుత్వం తగిన విధంగా స్పందించడం లేదని ఆరోపించారు. ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన పరిహారం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని డిమాండ్ చేశారు.
గతంలో ఆటో కార్మికులకు అండగా పువ్వాడ అజయ్ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆటో కార్మికుల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని వక్తలు గుర్తు చేశారు....
ముఖ్యంగా ఆటో కార్మికులపై ఉన్న రోడ్ ట్యాక్స్‌ను రద్దు చేయడంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు గత ప్రభుత్వాల కంటే మెరుగైన కార్యక్రమాలు అమలు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని, అయితే ప్రస్తుతం ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని వారు విమర్శించారు. రవాణా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేసి ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు....

**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు....**
ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు మాటూరు లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఠాగూర్, చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకుడు మెంతుల శ్రీశైలం, మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు, బోజట్ల రామ్మోహన్, మాజీ నగర ప్రచార కార్యదర్శి షకీన, మాజీ నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్, జిల్లా శ్రీను, ఉల్లోజు శ్రీనివాసు, షేక్ ఉస్మాన్, ఆరంపల వీరభద్రం, కందాల వీరేందర్, షేక్ సద్దాం, దండగల రాంబాబు, మాధవి, ఎస్‌కే పాషా, నవీన్, బి. సైదా, బి. రాజా, కస్తాల ఉపేందర్, పోతనబోయిన నవీన్, వీరన్న, సురేష్, పి. ఉపేందర్, ప్రసాద్, గుగులోత్ నవీన్, కోటి, రవి, జానీ, వెంకటి, రమేష్, నాగరాజు, కె. ప్రవీణ్, శివాయిగూడెం బి. సైదా, జి. నవీన్ తదితర ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

# ఉపాధ్యాయులు డా. సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తిని కలిగి ఉండాలి

**ఖమ్మం, సెప్టెంబర్ 6 (జనం ముచ్చట):**
సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి మొదటి స్థానంలో నిలుస్తుందని, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణ ఆశయాలను, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం నగరం లోని నాగార్జున ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీపీటీఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మ ముత్తారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు....
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు మాట్లాడుతూ,




ముందుగా డా. సర్వేపల్లి రాధాకృష్ణ, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే శిల్పులని అన్నారు.
ప్రస్తుతం జిల్లా ఇంటర్మీడియట్ విద్యారంగంలో నమోదవుతున్న అద్భుతమైన ఫలితాల్లో ప్రైవేట్ అధ్యాపకుల పాత్ర కూడా ఎంతో గొప్పదని రవిబాబు గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యాధికారిగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు డా. సర్వేపల్లి రాధాకృష్ణ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు....
టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదుర్కొం టున్నారని, వారి సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే టీపీటీఎల్ఎఫ్ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రైవేట్ ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సేవలను గుర్తించి సన్మానించడం అభినంద నీయమని జిల్లా బాధ్యులను ఆయన ప్రశంసించారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యా యులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. విద్యారంగానికి వారు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ శాలువాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.....
ఈ కార్యక్రమంలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్, యూటీఎఫ్ నాయకులు రంజాన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రవీణ్, టీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క ఉమాశంకర్, టీపీటీఎల్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు అనుమోలు రామారావు, జోనబోయిన అంజయ్య, పొదిల చిరంజీవి, విజయ్, ఫారూఖ్, ఉపేందర్, హుస్సేన్, నవీన్, కమలాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.....